telangana chowrasta.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:307

24 క్యారెట్లు 1,54,950.00 | కిలో వెండి 2,55,000.00 | CHOWRASTHA DIGITALS | 30.05.2026 శనివారం, హైదరాబాద్




## ప్రతి గింజా కొంటాం

- రైతులు ఆందోళన చెందొద్దు
- ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మొద్దు
- తడిసిన ధాన్యం 9 వేల మెట్రిక్ టన్నులు కొన్నాం
- ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చాం
- 13వేల వాహనాల ద్వారా సరఫరా చేపిస్తున్నాం
- రెండు లక్షల మంది సిబ్బంది పని చేస్తున్నారు
- బీజేపీది రైతు ఘోష యాత్ర కాదు..అధికార ఘోష యాత్ర
- బీజేపీ నేతలు బరితెగించి బజారులో తిరుగుతున్నారు
- మంత్రులు ఎన్ ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావు

2

# నీట్ పేపర్ లీక్ అత్యంత బాధాకరం


- యూపీఎస్సీని చూసి నేర్చుకోండి
- ఎన్టీఏ పై సుప్రీం తీవ్ర ఆగ్రహం
- కమిటీ సిఫార్సుల్లోనే లోపాలు ఉండొచ్చు
- పరీక్షను పర్యవేక్షించేందుకు కమిటీ ఉన్నా పేపర్ ఎలా లీకైంది
- జవాబుదారీతనం వచ్చేవరకు ఈ సమస్య ఆగదు
- సుప్రీంకోర్టు



" నీట్‌యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించేందుకు కమిటీ ఉన్నా పేపర్ ఎలా లీకైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఘటన విద్యార్థులకు మాత్రమే కాకుండా వారి కుటుంబాలకు కూడా అత్యంత బాధాకరమైనదని అభిప్రాయపడింది. నీట్‌కు సన్నద్ధం కావటానికి యువత కష్టపడుతుందని, వారిని ఇలా నిరాశకు గురిచేయటం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో :**
నీట్ యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించేందుకు కమిటీ ఉన్నా పేపర్ ఎలా లీకైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఘటన విద్యార్థులకు మాత్రమే కాకుండా వారి కుటుంబాలకు కూడా అత్యంత బాధాకరమైనదని అభిప్రాయపడింది. నీట్‌కు సన్నద్ధం కావటానికి యువత కష్టపడుతుందని, వారిని ఇలా నిరాశకు గురిచేయటం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఎన్టీఏను రద్దు, పరీక్ష నిర్వహణలో మార్పులు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఉన్నత స్థాయి కమిటీ ఉన్నా నీట్ పేపర్ లీకైందంటే కమిటీ ఇచ్చిన సిఫార్సుల్లో లోపాలు ఉండొచ్చని లేదా కమిటీ సిఫార్సులను క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు చేసి ఉండకపోవచ్చని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వ్యవస్థలో జవాబుదారీతనం వచ్చేవరకు ఇలాంటి సమస్యలకు ముగింపు ఉండదని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ

..మిగతా 2 లో



## జూన్ 5 తరువాతే తెలంగాణకు నైరుతి రుతుపవనాలు

- జూన్ 4, 5 తేదీల్లో కేరళ తీరాన్ని తాకే అవకాశం
- అంచనాలకు భిన్నంగా నైరుతి ఆలస్యం
- హైదరాబాద్ వాతావరణం శాఖ

2

## నెలలో మూడు రోజులు కార్యకర్తలను కలుస్తా

- వారానికి ఒక రోజు మంత్రులు పార్టీ పనులపై దృష్టి కేంద్రీకరించాలి
- అందరూ పార్టీ కోసం కృషి చేయాల్సిందే
- క్షేత్రస్థాయికి వెళ్ల కార్యకర్తలను కలవాలి
- గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించాం
- ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీతో సన్మానం
- సర్ తో లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు నష్టం
- అందరూ సర్ తో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి

ప్రత్యేక విస్తృత సవరణ (సర్ )తో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య అని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, పీసీసీ అడ్వైజరీ కమిటీ ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ పైన అందరు అవగహన పెంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
ప్రత్యేక విస్తృత సవరణ (సర్ )తో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య అని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, పీసీసీ అడ్వైజరీ కమిటీ ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ పైన అందరు అవగహన పెంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామమని అభినందించారు. సర్ లంబాడీ లు ,ఆది వాసీలు, వలస

..మిగతా 2 లో



## సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర

- కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను కూడా
- బంగాల్ తర్వాత పంజాబ్, తెలంగాణనే బీజేపీ టార్గెట్
- కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి
- సర్‌పై గాంధీ భవన్ లో అవగాహన తరగతులు
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్


2



2

## అనర్హుల ఓట్లు తొలగించండి

- అర్హులను పేరును ఓటర్ లిస్ట్ లో చేర్చండి
- ఎన్నికల యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాలి
- శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సీ సుదర్శన్ రెడ్డి



4

## ఏపీ కాంగ్రెస్‌పై అధిష్టానం ఫోకస్

- కర్ణాటక నుంచి రాజ్యసభకు షర్మిళ
- రాహుల్ గాంధీని కలిసిన వైఎస్ షర్మిల

## తప్పుడు ఆరోపణలు చేస్తే తరిమికొడుతం

- ఎంత మందిని ఉసిగొల్పినా తిప్పికొడుతం
- రాష్ట్రంలో పరోక్షంగా తెలుగుదేశం బాబు పాలన
- ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఉద్యమకారులు

4



## సొంతంగా సెక్స్ వర్కర్లుగా మారడం నేరం కాదు

- వారికి ఆధార్ కార్డులు జారీ చేయాలి
- సెక్స్ వర్కర్స్ ను పోలీసులు వేధించొద్దు
- వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధం
- దేశంలో ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉంది
- సుప్రీంకోర్టు

2





# నీట్ పేపర్ లీక్ అత్యంత బాధాకరం

▶▶ మొదటిపేజీ తరువాయి

సందర్భంగా UPSC అంశాన్ని ప్రస్తావించిన సుప్రీం కోర్టు ఇప్పటివరకు ఇలాంటి వివాదాల్లో చిక్కుకోలేదని తెలిపింది. వారిని చూసి నేర్చుకోవాలని NTAకు సూచించింది."ఉన్నతస్థాయికమిటీసిఫార్సులఆధారంగా మీరు పర్యవేక్షించినా ఈ ఘటన జరిగిందంటే అసలు సిఫార్సులోనే లోపం ఉంది. ఎందుకంటే ఇలాంటి పరిస్థితి తలెత్తుతుందని మీరు ఊహించలేదు. రెండోది, సమర్థమంతమైన పర్యవేక్షణ జరిగి ఉండదు. ఇది ఎలా జరిగింది?" అని కమిటీకి నేతృత్వం వహించిన రాధాకృష్ణన్ను జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. దీనికి బదులిచ్చిన రాధాకృష్ణన్, నీట్ పరీక్షలో తలెత్తిన సమస్యల నేపథ్యంలో 2024 జూన్‌లో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, వారు 101 సిఫార్సులు ఇచ్చారని తెలిపారు. స్వల్పకాలికంగా (2025, 2026 పరీక్షల కోసం) 60 సిఫార్సులు చేయగా, వాటిలో చాలా వరకు అమలు చేశామన్నారు. దీర్ఘకాలికంగా 35 సిఫార్సులు చేశామని వాటిలో చాలా వరకు ప్రారంభించామని ధర్మాసనానికి తెలిపారు. ఈ అంశంపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పరీక్షలను ఎలా నిర్వహించాలి? ఎన్‌టీఏలో నిపుణులను చేర్చడం ద్వారా మానవ వనరులను ఎలా మెరుగుపరచాలి? అనే అంశాలపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు బదులుగా, విద్యా శాఖ ముందుగా అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. 2024, 2026 పరీక్షలో జరిగినటువంటి ఘటన మళ్లీ జరగకుండా చూసేందుకు ఎన్‌టీఏకు భౌతికంగా, మేధోపరంగా అవసరమైన వనరులు ఉండేలా చూడటమే తమ ప్రయత్నమని వ్యాఖ్యానించింది. అటు నీట్‌యూజీ రీ షెడ్యూల్డ్ పరీక్ష ప్రక్రియతో పాటు లీకేజీ వ్యవహారాన్ని ప్రధాని మోదీ వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. యువత ఆందోళనల పట్ల ప్రభుత్వం తీవ్రంగా శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్ యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామని కోర్టుకు చెప్పారు. ఈ కేసు తదుపరి విచారణను జూలై రెండో వారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

**సుప్రీం కోర్టుకు ఎన్‌టీఏ అఫిడవిట్**

మరోవైపు, నీట్ పేపర్ లీకేజీ విచారణలో భాగంగా సుప్రీం కోర్టుకు ఎన్‌టీఏ అఫిడవిట్ సమర్పించింది. వచ్చే సంవత్సరం నుంచి నీట్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన అనంతరం NEETUG పరీక్షను 'పెన్ అండ్ పేపర్' విధానానికి బదులుగా 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష' (CBT) విధానంలో నిర్వహించడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. నీట్‌యూజీ పేపర్ లీకేజీ వ్యవహారం తర్వాత పరీక్షల నిర్వహణలో పలు సంస్కరణలు చేపట్టినట్లు చెప్పింది. తమ పర్యవేక్షణలో పరీక్షలన్నీ పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. పరీక్షకు ముందు, పరీక్ష జరుగుతున్న సమయంలో, ఆ తర్వాత తీసుకోవాల్సిన ముందస్తు రక్షణ చర్యలపై ఏప్రిల్‌లో హైపవర్డ్ స్టీరింగ్ కమిటీ సమావేశమైందని NTA తన అఫిడవిట్‌లో పేర్కొంది. అందులో భాగంగా పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీల తనిఖీని తప్పనిసరి చేయనున్నట్లు తెలిపింది. పరీక్ష ముగిసిన తర్వాత ఆ ఫుటేజీని కనీసం 90 రోజుల పాటు భద్రపరచనున్నట్లు వెల్లడించింది. పరీక్ష ముగిసిన తర్వాత సీసీటీవీ ఫుటేజీలపై ఫోరెన్సిక్ విశ్లేషణ నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ చేసిన పలు సిఫార్సులను ఇప్పటికే అమల్లోకి తెచ్చామని, అందులో కొన్ని చివరి దశలో ఉన్నాయని NTA తమ అఫిడవిట్‌లో తెలిపింది.

# నెలలో మూడు రోజులు కార్యకర్తలను కలుస్తా

▶▶ మొదటిపేజీ తరువాయి



కార్మికులకడిజిటల్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇన్ చార్జిని నియమించి నిరంతరం పర్యవేక్షించామని తెలిపారు. సర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇన్ చార్జిలను నియమించాలనీ, అసెంబ్లీ ఇన్ చార్జిలు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని దిశానిర్దేశం చేశారు. ఇన్ చార్జిలు సరిగ్గా పని చేస్తే ఒక్క ఓటు కూడా □తొలగించకుండా అడ్డుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. ఇన్ చార్జి మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలనీ, క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తాననీ, నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తానని తెలిపారు. తనతో పాటు ఎవరికి మినహాయింపు ఇవ్వొద్దనీ, పార్టీ కోసం అందరూ పని చేయాల్సిందనని తేల్చి చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లతో సహా ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. దాదాపు గా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామనీ, పార్టీ తరుపున ప్రస్తుతం వేలాది మంది సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా పార్టీ నాయకులంతా సమన్వయం తో జాగ్రత్త పడాలని కోరారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని తెలిపారు. రాజ్య సభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలనీ, నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో సర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాలని సూచించారు. సర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీ గా సమావేశాలు నిర్వహించాలన్నారు.

**పీసీసీ అధ్యక్షుడి ఆదేశాలను అందరం పాటించాల్సిందే..**

వారానికి ఒక రోజు మంత్రులు పార్టీ పనులపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తాను కూడా వారానికి ఒక రోజు పీసీసీ అధ్యక్షుడు కేటాయించిన నియోజకవర్గంలో పాల్గొంటానని తెలిపారు. పార్టీ నిర్మాణంలో ప్రతిష్టపరచడంలో భాగస్వాములు కావాలన్నారు. పీసీసీ అధ్యక్షుల ఆదేశాలను అందరం పాటించాలని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు చేస్తున్న పనులపై మీనాక్షి నటరాజన్ సమీక్షించాలని కోరారు. □దాదాపు గా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామనీ, పార్టీ తరుపున ప్రస్తుతం వేలాది మంది సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా పార్టీ నాయకులంతా సమన్వయం తో జాగ్రత్త పడాలని కోరారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలనీ, నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీ గా సమావేశాలు నిర్వహించాలన్నారు. శనివారం నుంచి మంత్రులకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులకు టీపీసీసీ అధ్యక్షులు నియోజకవర్గాలను కేటాయించనున్నారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజా కొంటాం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**




ఇటీవల కురిసిన వర్షాలకు తడిన తడిసిన ధాన్యాన్ని 9వేల మెట్రిక్ టన్నులను కొన్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చామని తెలిపారు. ధాన్యం సేకరణలో దాదాపు రెండు లక్షల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. 2008 రైస్ మిల్లులలకు 13వేల వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. 20.86 కోట్ల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. కానీ ప్రతిపక్షాలు ధాన్యం సేకరణలో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘురామ్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. స్వతంత్ర భారత దేశంలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో అత్యధిక ధాన్యాన్ని సేకరించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే తన నివేదికల్లో పేర్కొందని తెలిపారు. పదేండ్ల కాలంలో సేకరించిన పోల్చితే ఎక్కువగా కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిందన్నారు. కేంద్రం సర్కారు నిర్ణయించిన మద్దతు ధర నిబంధలు పాటిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని విమర్శించారు. అయినా రూ. 16,479 కోట్లు అదనంగా చెల్లించి కొనుగోలు చేశామని చెప్పారు. కాళేశ్వరం, సుందిళ్ల రిజర్వాయర్ ఉపయోగించకుండానే అత్యధిక పంట ఉత్పత్తి జరుగుతోందన్నారు. చివరి గింజా వరకు కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో 1.41 లక్షల మెట్రిక్ టన్నులు వరి ఉత్పత్తి అవుతోందనీ, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల సేకరిస్తామన్నారు. కానీ 52 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకుంటాం. మిగతాది తీసుకోలేమంటూ కేంద్రం మెలిక పెట్టిందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని కొని కూడా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. తెలంగాణలో కూలీలు పని చేయడం లేదనీ, పూర్తిగా బీహర్ హమాలీలపై ఆధారపడి ఉందన్నారు. బీహార్‌లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడం, బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో కూలీల కొరత ఏర్పడిందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు బీఆర్ఎస్ సర్కారు రూ. 15వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ. 49వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వం 7వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ సర్కారు 8575 కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 202425లో రూ. 36,143 కోట్లు, 202526లో రూ.39,359 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఆ సొమ్మును 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు.

**బీజేపీ నేతలు బరితెగించి బజారులో తిరుగుతున్నారు: తుమ్మల**

బీజేపీ నేతలు రైతు ఘోష పేరిట బరితెగించి బజారుతో తిరుగుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. తెలంగాణలో పండిన మొత్తం ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయాలని ఢిల్లీ యాత్ర చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలది రైతు ఘోష యాత్ర కాదు... అధికార ఘోష యాత్ర అని ఎద్దేవా చేశారు. రైతులు కష్టాల్లో ఉంటే డీజిల్ సరఫరా చేయలేదని విమర్శించారు. దీంతో రైతులు చాలా ఇబ్బందిపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సరఫరా విషయంలో కేంద్రం రైతులను ఘోస పెట్టిందని విమర్శించారు. దీనికి బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమెరికాతో కేంద్రం వాణిజ్య ఒప్పందం చేసుకోవడంతో రైతుల గొంతు కోసిందన్నారు.



# జూన్ 5 తరువాతే తెలంగాణకు నైరుతి రుతుపవనాలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఈసారి నైరుతి రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం కానుంది. జూన్ 4, 5 తేదీల్లో కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ఈ మేరకు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని వాతావరణ శాఖ ముందుగా అంచనా వేసినప్పటికీ దానికి భిన్నంగా రుతుపవనాల కదలికలు ఉన్నాయి. గతేడాది మే 24న కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు అప్పటి అంచనా కంటే 8 రోజులు ముందే ప్రవేశించాయి. 2025లో మే 26న తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది వానాకాలం కొంత ఆలస్యంగా ప్రారంభం కానుంది. ప్రస్తుతం వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం జూన్ ఐదో తేదీ తర్వాతే తెలంగాణను నైరుతి రుతుపవనాలు తాకుతాయని తెలుస్తోంది. భారతదేశ దక్షిణ ప్రాంతాన్ని ఈ నెల 25న తాకుతాయని వాతావరణ శాఖ తొలుత అంచనా వేసినా ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రుతుపవనాల కదలికల్లో వేగం అధికంగా తగ్గింది. ఇప్పటి వరకు హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో విస్తరిస్తూ వచ్చిన పవనాలు శ్రీలంక సగం వరకు వచ్చి ఆగిపోయాయి. ఈ ఏడాది వానాకాలంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే భారత వాతావరణ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాధారణంగా అయితే మే నెల చివరికల్లా తెలంగాణ రాష్ట్రాన్ని రుతుపవనాలు చేరుకోవాల్సి ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో జూన్ 5వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య రావొచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల వర్షాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

నైరుతి రుతుపవనాల ఆలస్యం అలా ఉండగా జూన్ నెలలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ అంచనా వేసింది. మధ్య, వాయువ్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా చాలా వరకు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, బిహార్, ఒడిశా, హర్యానా, ఛత్తీస్గఢ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్లలో సాధారణం కంటే ఎక్కువగా వడగాలుల వీచే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలలో కూడా వడగాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. సముద్ర పరిస్థితులపై డాక్టర్ మృత్యుంజయ్ మాట్లాడుతూ, ప్రస్తుతం తటస్థ ఈఎన్ఎస్ఓ పరిస్థితులు ఎల్నినో వైపుగా మారుతున్నాయని తెలిపారు. జూన్ నాటికి ఎల్నినో పరిస్థితులు స్పష్టంగా ఏర్పడే అవకాశం 82 శాతంగా ఉందని, జూలై, ఆగస్టు నాటికి 90 శాతానికి పైగా చేరుతుందని అన్నారు. రుతుపవన కాలమంతా తటస్థ హిందూ మహాసముద్ర ద్విధ్రువ(ఐఓడీ) పరిస్థితులు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

మే 16న అండమాన్ నికోబార్ దీవుల్లోకి : దేశవ్యాప్తంగా మే నెలలో వర్షపాతం సాధారణం కంటే నాలుగు శాతం ఎక్కువగా నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. మే 27 వరకు నమోదైన మొత్తం రుతుపవన వర్షపాతం సాధారణం కంటే ఒక శాతం అధికంగా ఉందని డాక్టర్ మృత్యుంజయ్ పేర్కొన్నారు. ఈసారి రుతుపవనాలు సాధారణంగా మే 16న అండమాన్ నికోబార్ దీవుల్లోకి ప్రవేశించాయని ఆయన తెలిపారు. వచ్చే వారంలోగా కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లోకి ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా వెల్లడించారు.

# అనర్హుల ఓట్లు తొలగించండి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



రాష్ట్రంలో నిర్వహించే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరును ఓటరు జాబితాలో చేర్చాలని, అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి చెప్పారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయంలో అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో 'సర్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు), బీఎల్ఓ సూపర్ వైజర్లు తదితర ఎన్నికల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో పూర్తి చేయాలని చెప్పారు. ఐటీ సంబంధిత కార్యకలాపాలు, చట్టపరమైన నిబంధనలు, సర్ ప్రక్రియలోని దశలు, విధానాలు సహా పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సొంతంగా సెక్స్ వర్కర్లుగా మారడం నేరం కాదు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు సెక్స్ వర్కర్ల హక్కులను కాపాడేందుకు సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన మార్గదర్శకాలను జారీ చేసింది. స్వచ్ఛందంగా లైంగిక వృత్తి (సెక్స్ వర్కర్లుగా మారుతున్న వారు)ని ఎంచుకున్న వయోజనులకు, బలవంతంగా ఈ రొంపిలోకి లాగిన బాధితులకు మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాలని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వానికి, పోలీసులకు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం దేశంలో ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని, కేవలం లైంగిక వృత్తిలో ఉందనే ఏకైక కారణంతో ఏ తల్లి నుంచైనా ఆమె బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

**పోలీసులకు కఠిన ఆదేశాలు.. మీడియాకు హెచ్చరికలు**

తన వ్యక్తిగత కారణాలతో సొంతంగా, ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై అనవసరంగా దాడులు చేయడం, వారిని వేధించడం లేదా క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు పోలీసులను ఆదేశించింది. అలాగే, రెస్క్యూ ఆపరేషన్లు లేదా దాడులు నిర్వహించే సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలను ప్రసారం చేయడం లేదా వారి గుర్తింపును వెల్లడించడం తీవ్రమైన నేరమని మీడియాకు హెచ్చరికలు జారీ చేసింది. స్వచ్ఛందంగా ఈ వృత్తిలో ఉన్నవారిని వదిలిపెట్టి.. మహిళలు, మైనర్లను బలవంతంగా అక్రమ రవాణా చేసే మాఫియాపై మాత్రమే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది.

**ఆధార్ కార్డుల జారీకి స్పష్టమైన ఆదేశం**

సెక్స్ వర్కర్లకు ఇతర వ్యక్తుల తరహాలోనే సమాన చట్టపరమైన రక్షణ కల్పించడంలో భాగంగా సుప్రీంకోర్టు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. నివాస ధృవీకరణ పత్రాలు (అడ్రస్ ప్రూఫ్) లేకపోయినప్పటికీ, సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులను జారీ చేయాలని యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (UIDAI)ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీని ద్వారా వారికి సామాజిక భద్రతతో పాటు ఇతర వ్యక్తుల తరహాలోనే ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు పొందే అవకాశం లభిస్తుందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

**తీర్పులపై హైకోర్టులకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు..**

హైకోర్టులలో విచారణలు పూర్తయిన తర్వాత తీర్పుల ప్రకటనలో జరుగుతున్న ఆలస్యాన్ని (తీర్పు రిజర్వ్) నివారించడమే లక్ష్యంగా సుప్రీంకోర్టు శుక్రవారం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. తీర్పుల ప్రకటనలో ఆలస్యం కావడం వల్ల పిటిషనర్లకు చాలా నష్టం జరుగుతుందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయాలలో సకాలంలో తీర్పులు ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. రిజర్వ్ చేసిన తీర్పులను సాధారణంగా 3 నెలల లోపే వెల్లడించాలని ఆదేశించింది. బెయిల్ విషయాలలో ఆర్డర్లను అదే రోజు ప్రకటించడానికి ప్రయత్నాలు జరగాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఒకవేళ తీర్పు ఉత్తర్వులను రిజర్వ్ చేసినట్లయితే, వాటిని మరుసటి రోజుకల్లా డెలివరీ చేసి, సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది.

# సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**




సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోందని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న సర్‌పై పార్టీ నాయకులకు అవగాహన కల్పించేందుకు గాంధీభవన్‌లో పీసీసీ రాజకీయ వ్యవహారాలు, అడ్వైజరీ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు.ఏఐసీసీ శిక్షణ విభాగం నుంచి వచ్చిన వారితో అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు నియోజకవర్గ బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ చేపట్టారు. సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోందని.. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు బీజేపీ యత్నిస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బంగాల్ తర్వాత పంజాబ్, తెలంగాణనే బీజేపీ టార్గెట్ చేసిందని.. కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరిట సెక్యులర్ ఓట్లను తొలగించే ప్రక్రియ చాలా పకడ్బందీగా చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు.బంగాల్లో సుమారు 93 లక్షల ఓట్లను తొలగించారని తెలిపారు. అయితే అప్పీల్ చేసుకొనేందుకు కేవలం 30 లక్షల మందికి మాత్రమే అవకాశం ఇచ్చారన్నారు. సుమారు 62 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించాలని ఆరోపించారు. దీంతో ఆ రాష్ట్రంలో ప్రభుత్వమే మారిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని పార్టీ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్లకు కాపాడుకొనేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు పూర్తి అవగాహన ఉన్న వారిని నియమించినట్లు తెలిపారు. నేతలందరూ ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు.

# జీనియస్ వరల్డ్ రికార్డ్‌లో శెట్టి మోక్షిత్ రిషి సరికొత్త రికార్డు

- గత ఏడాది గిన్నిస్ బుక్, ఇప్పుడు జీనియస్ రికార్డ్స్
- కుక్కునూరు బాలుడి అరుదైన ఘనత
- పత్రాన్ని అందజేసిన ఇంటర్నేషనల్ మ్యూజిక్ స్కూల్ అధినేత అగస్టీన్ దండంగి




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:** సంగీత ప్రపంచంలో కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామం పంచాయతీ కి ఆఫ్ కమింగ్ స్టార్ చెందిన ఓ అప్ కమింగ్ స్టార్ అంతర్జాతీయ వేదికలపై మారుమోగుతున్నాడు. తన అద్భుతమైన పియానో వాయిద్య నైపుణ్యంతో ఇప్పటికే పలు అంతర్జాతీయ రికార్డులను సొంతం చేసుకున్న కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బాలుడు శెట్టి మోక్షిత్ రిషి నిహార్ తాజాగా మరో ప్రతిష్టాత్మక 'జీనియస్ వరల్డ్ రికార్డ్'ను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న మోక్షిత్, స్థానిక జర్నలిస్ట్ గోపి మేరీ దంపతుల ద్వితీయ కుమారుడు. చిన్నతనం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకున్న మోక్షిత్, పియానో వాయిద్యంలో ప్రత్యేక శైలిని అలవర్చుకుని ఈ అరుదైన ప్రతిభను చాటుకున్నాడు. గత ఫిబ్రవరి మాసంలో హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ స్థాయిలో ఒక బృహత్తర సంగీత ప్రదర్శన జరిగింది. వివిధ దేశాలకు చెందిన సుమారు రెండు వేల మంది సంగీత కళాకారులు ఏకకాలంలో పాల్గొని చేసిన ఈ సుదీర్ఘ పియానో ప్రదర్శనలో మోక్షిత్ తన అద్భుతమైన శైలితో అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ మహా జుగల్ బందీ ప్రదర్శన అంతర్జాతీయ వేదికపై సరికొత్త రికార్డును సృష్టించి 'జీనియస్ వరల్డ్ రికార్డ్'లో చోటు సంపాదించింది. ఈ వరల్డ్ రికార్డుకు సంబంధించిన ప్రధానోత్సవ కార్యక్రమం గురువారం హైదరాబాద్ గచ్చిబౌలిలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేదికపై ఇంటర్నేషనల్ మ్యూజిక్ స్కూల్ అధినేత అగస్టీన్ దండంగి చేతుల మీదుగా మోక్షిత్ రిషి నిహార్ అధికారిక వరల్డ్ రికార్డ్ ప్రతిభాపత్రాన్ని అందుకున్నాడు. అంతటి ప్రతిష్టాత్మక వేదికపై, అంతర్జాతీయ నిపుణుల సమక్షంలో మోక్షిత్ ఈ అవార్డు అందుకోవడం జిల్లా వాసులను ఎంతగానో అలరించింది. అయితే ఈ చిన్న వయసులోనే మోక్షిత్ అంతర్జాతీయ రికార్డులను తిరగరాయడం విశేషం. గత ఏడాది కూడా పియానో వాయిద్యంలో చూపిన ప్రతిభకు గానూ ప్రతిష్టాత్మక 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో ఈ బాలుడు చోటు సంపాదించాడు. ఇలా వరుసగా గిన్నిస్ బుక్, జీనియస్ రికార్డులను కొల్లగొడుతూ అప్రతిహతంగా దూసుకుపోతున్న మోక్షిత్ ప్రతిభను చూసి స్వగ్రామమైన వెంకటాపురంలో పండుగ వాతావరణం నెలకొంది. సంగీత రంగంలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకుని, కుక్కునూరు ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన మోక్షిత్‌పై ప్రస్తుతం ప్రశంసల జల్లు కురుస్తోంది. మోక్షిత్ సాధించిన ఘనతపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో మోక్షిత్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశం గర్వించదగ్గ గొప్ప సంగీత విద్వాంసుడిగా ఎదగాలని గ్రామస్తులు ఆశీర్వదించారు.



## నిరుపేదలకు సీఎం సహాయ నిధి కొండంత అండ

- ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్

**సైదాపూర్ తెలంగాణ చౌరస్తా:** సైదాపూర్ మండలంలోని జాగిరి పల్లి గ్రామానికి చెందిన దొడ్డి వీరస్వామి కి మంజూరైన రూ.1,75,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు ను శుక్రవారం ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్ తన కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి వైద్య ఖర్చులకు భరించలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వెన్నెంపెల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజిరెడ్డి పిట్టల రాకేష్ మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రొద్దుటూరి గౌరీశంకర్

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:** ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తొర్రూరు పట్టణానికి చెందిన ప్రొద్దుటూరి గౌరీశంకర్‌ను నియమించినట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరీశంకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అమరావతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..గౌరీశంకర్ గత 30 సంవత్సరాలుగా ఆర్యవైశ్య సంఘంలో చురుకుగా పనిచేస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సంఘ అభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు ఆర్యవైశ్యుల్లో రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి నియమించినట్లు పేర్కొన్నారు. ఈ పదవిలో ఆయన రెండేళ్లపాటు కొనసాగుతారని వెల్లడించారు.భవిష్యత్తులోనూ సంఘ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.తన సేవలను గుర్తించి



మరోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణకు,రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులకు,ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్యవైశ్యులకు ప్రొద్దుటూరి గౌరీశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.




## ఘనంగా టిపిటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**దంతాలపల్లి-తెలంగాణ చౌరస్తా:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను దంతాలపల్లి మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టిపిటీఎఫ్ మండల అధ్యక్షుడు తాలూరి రవీందర్ సంఘ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో తాలూరి రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ప్రవేశపెట్టిన నూతన వైద్య విధానం (ఈహెచ్ఎస్)లో అనేక లోపాలు ఉన్నాయని విమర్శించారు.హెల్త్ కార్డు ఎంపిక విషయంలో ఉద్యోగులు,ఉపాధ్యాయులకు ఆప్షన్ కల్పించాలని,ఏయే ఆసుపత్రులు ఈ పథకం పరిధిలోకి వస్తాయనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం సరికాదన్నారు.కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ఈహెచ్ఎస్ రికవరీ ఉండాలని,ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి 1.5 శాతం రికవరీ చేస్తున్న ప్రభుత్వం అదే మొత్తాన్ని జమ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వానికి స్పష్టత లేకపోవడం వల్ల భవిష్యత్తులో ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య సేవలు అందించడంలో జాప్యం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.వెంటనే ఈ లోపాలను సరిదిద్ది ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.టిపిటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సురేష్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ఉపాధ్యాయ ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిపిటీఎఫ్ సీనియర్ కార్యకర్తలు డి. నగేష్, ఉమేష్,వెంకన్న, రామ్మూర్తి,ఎమ్మార్సీ సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యాధులపై వైద్య అధికారులకు సమగ్ర శిక్షణ

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు
- పోలియో, తట్టు వ్యాధుల నిర్మూలనే లక్ష్యం..
- క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచన
- జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల హాజరు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా:** జిల్లాలో టీకాల ద్వారా నివారించగల వ్యాధుల పూర్తి నిర్మూలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కసరత్తు ప్రారంభించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రాల వైద్య అధికారులకు 'వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల'పై ప్రత్యేక అవగాహన దిశానిర్దేశక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్యంగా పోలియో తట్టు (మీజిల్స్) వ్యాధుల లక్షణాలు, సమాజంలో వాటి బారిన పడిన అనుమానిత రోగులను ప్రాథమిక దశలోనే గుర్తించే విధానాలపై వైద్యులకు సమగ్రంగా వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చేపట్టాల్సిన క్షేత్రస్థాయి పరిశోధనలు, రోగుల నుంచి నమూనాల సేకరణ, ఆ తర్వాత తీసుకోవాల్సిన తదుపరి జాగ్రత్తలు, వ్యాధి ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నిరోధించే నియంత్రణ చర్యలు ఉన్నతాధికారులకు సకాలంలో నివేదికలు సమర్పించే విధానాలపై నిపుణులు సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో టీకాల ద్వారా అరికట్టగలిగే వ్యాధుల నిర్మూలన లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు ప్రతి వైద్య అధికారి నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఎక్కడైనా అనుమానిత కేసులు వెలుగుచూస్తే ఆలస్యం చేయకుండా వెంటనే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు తక్షణ సమాచారం అందించాలని స్పష్టం చేశారు .ఈ ఉన్నత స్థాయి శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక విభాగాధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ రాకేష్, డాక్టర్ దినేష్, డాక్టర్ హరీష్‌లతో పాటు జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు ఆరోగ్య శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జేవీఆర్ ఓసీ, కోల్ యార్డులను పరిశీలించిన టీబీజీకేఎస్ నేతలు

- సత్తుపల్లి ఏరియా మేనేజర్‌తో కార్మిక సమస్యలపై చర్చ
- బొగ్గు గనుల్లో టీబీజీకేఎస్ నేతల విస్తృత పర్యటన
- సత్తుపల్లి కోల్ యార్డులను తనిఖీ చేసిన టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:** సత్తుపల్లిలోని జేవీఆర్ ఓపెన్ కాస్ట్ గని, కోల్ యార్డులను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రతినిధి బృందం పరిశీలించింది. టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య క్షేత్రస్థాయిలో పర్యటించి బొగ్గు ఉత్పత్తి, రవాణా ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం సత్తుపల్లి ఏరియా మేనేజర్ రాజేశ్వరరావుతో వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియాలోని కార్మికుల సంక్షేమం, వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల గురించి మేనేజర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. కార్మికులకు మెరుగైన వసతులు కల్పించాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కిష్టారం ఓసీ బ్రాంచ్ కార్యదర్శి అశోక్, టీబీజీకేఎస్ యూనియన్ సీనియర్ నాయకులు పిచ్చయ్య, చంద్రశేఖర్, రఘువీర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.








# విద్యానగర్‌లో అక్రమ నిర్మాణాల జోరు


- నిస్సహాయ' స్థితిలో పంచాయతీ అధికారులు
- గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ జీ+3 భవనాల నిర్మాణం.. వెనుక రాజకీయ హస్తం. ?
- పెద్ద కాలువలు, బఫర్ జోన్ల కబ్జా..
- వర్షం వస్తే చెరువులను తలపిస్తున్న నేషనల్ హైవే
- పట్టించుకోని జిల్లా పంచాయతీ యంత్రాంగం..
- వర్షా లు రాకముందే చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాల దందా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా వెలుస్తున్న కట్టడాల ముందు స్థానిక పంచాయతీ అధికారులు పూర్తిగా నిస్సహాయ స్థితిలో ఉండిపోవడం గమనార్హం. అక్రమ కట్టడాలకు స్వయంగా పంచాయతీ అధికారులే నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, ఆ నిర్మాణదారులు కనీసం కేర్ చేయడం లేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిబంధనలు ఉల్లంఘించి 'జీ+3' అంతస్తుల భారీ భవనాలను నిర్మిస్తున్న అక్రమార్కులకు స్థానిక బడా రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్టం తమ చేతుల్లో ఉందనే ధీమాతోనే అధికారుల నోటీసులను సైతం వారు బుట్టదాఖలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఈ అక్రమ నిర్మాణాల వెనుక గిరిజన చట్టాల ఉల్లంఘన సైతం స్పష్టంగా కనిపిస్తోంది. గిరిజన ప్రాంతాల్లోని ప్రత్యేక చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజనేతరులు భారీ కట్టడాలను లేపుతున్నారు. ముఖ్యంగా నేషనల్ హైవే రోడ్డును ఆనుకొని కనీస పార్కింగ్ స్థలాలు కూడా వదలకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నారు. అంతటితో ఆగకుండా భవన నిర్మాణానికి సంబంధించిన ఇసుక, కంకర, ఐరన్ వంటి సామాగ్రిని సైతం ప్రధాన రహదారిపైనే కుప్పలుగా పోస్తున్నారు. దీనివల్ల ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ సామాగ్రి వల్ల ఏదైనా జరగరాని ప్రమాదం జరిగి ప్రాణ నష్టం సంభవిస్తే.. దానికి బాధ్యులు ఎవరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు ప్రకృతి వనరులను, సాగునీటి వనరులను సైతం ఈ అక్రమార్కులు వదలడం లేదు. స్థానిక చింతలచెరువు ఆధునీకరణ కోసం నియోజకవర్గ శాసన సభ్యులు (ఎమ్మెల్యే) ఎంతో శ్రమిస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. చెరువు బఫర్ జోన్ పరిధిలోకి వచ్చే కట్టను ఆనుకొని భారీ నిర్మాణాలు జరుగుతున్నా నివారించే నాథుడే కరువయ్యాడు. ఇంతకాలం రోడ్డు పక్కన ఉండి, వర్షపు నీరు సజావుగా సాగిపోయే పెద్దపెద్ద డ్రైనేజీ కాలువలను సైతం కబ్జా చేసి వాటిపైనే షాపింగ్ మాల్స్ నిర్మించేశారు. దీంతో సహజసిద్ధంగా వెళ్లాల్సిన నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా చిన్నపాటి వర్షం పడినా నేషనల్ హైవే రోడ్లన్నీ కాలువలను, చెరువులను తలపిస్తున్నాయి. వర్షం రాగానే అధికారులు అటు ఇటు పరుగులు పెట్టడం మినహా, శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. ముందస్తుగానే కాలువల ఆక్రమణలను అడ్డుకొని ఉంటే ఈరోజు జాతీయ రహదారిపై ఇంతటి దుస్థితి వచ్చేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా పంచాయతీ అధికారులు (డి పి ఓ ) ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే స్పందించాలని విద్యానగర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం పూర్తిగా ముంచుకురాకముందే జిల్లా ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇక్కడి పరిస్థితులను సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గిరిజన చట్టాలను బేఖాతరు చేస్తూ, కాలువలు, బఫర్ జోన్లను ఆక్రమించి నిర్మించిన అన్ని అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. చట్టాన్ని హేళన చేస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న అక్రమ నిర్మాణదారులపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలు తప్పవని స్థానికులు హెచ్చరిస్తున్నారు.





# మంత్రి శ్రీధర్ బాబు చొరవతో పేరపల్లికి కొత్త ట్రాన్స్ఫార్మర్

- తీరిన లో-వోల్టేజ్ సమస్య
- సర్పంచ్ బొంగోని సదయ్య వినతికి తక్షణ స్పందన
- త్వరలోనే వ్యవసాయ బావుల కోసం మరొక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు
- సర్పంచ్ వెల్లడి

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని పేరపల్లి గ్రామంలో గత కొంతకాలంగా వేధిస్తున్న లోవోల్టేజ్ (విద్యుత్ సరఫరా నాణ్యత తక్కువగా ఉండటం) సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎండకాలంలో లోవోల్టేజ్ కారణంగా గృహోపకరణాలు నడవక, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్థుల సమస్యను స్థానిక సర్పంచ్ బొంగోని సదయ్య రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థుల ఇబ్బందులపై మంత్రి శ్రీధర్ బాబు తక్షణమే స్పందించి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి, పేరపల్లి గ్రామానికి కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను మంజూరు చేశారు. కాగా, శనివారం నాడు అధికారులు గ్రామంలో కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను విజయవంతంగా ఏర్పాటు చేశారు.

**రైతుల కోసం మరొక ట్రాన్స్ఫార్మర్**
ఈ సందర్భంగా సర్పంచ్ బొంగోని సదయ్య మాట్లాడుతూ.. గ్రామంలోని రైతులకు కూడా వ్యవసాయ బావుల వద్ద లోవోల్టేజ్ సమస్య ఉందని, ఆ సమస్యను కూడా మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. మంత్రి సహాయంతో త్వరలోనే వ్యవసాయ బావుల కోసం ఇంకొక కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేయిస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించి ఊరట కలిగించినందుకు గాను పేరపల్లి గ్రామ ప్రజల తరపున రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




## తప్పుడు ఆరోపణలు చేస్తే
# తరిమికొడుతం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
తెలంగాణ కవులు, జర్నలిస్టులపై తప్పుడు ఆరోపణలు చేస్తే తరిమికొడుతామని తెలంగాణ ఉద్యమకారులు హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుడు శ్రీహరి మాట్లాడుతూ.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బానిసలు కొందరు మీడియా సమావేశంలో తెలంగాణ కవులు, జర్నలిస్టుల అస్తిత్వాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఆరోపణలు చేస్తున్న వారు తెలంగాణ ఉద్యమంలో ఎక్కడా కనబడలేదని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత తాను పదకొండు రోజులు ఆహారాన్ని తీసుకోలేదని వ్యాఖ్యానించిన పవన్ కల్యాణ్‌కు వత్తాసు పలుకుతూ తెలంగాణ ఉద్యమకారులను కించపరిస్తే సహించబోమని హెచ్చరించారు.
పాశం యాదగిరి, పృథ్వీరాజ్‌పై కారు కూతలు కూశారని, ముఖ్యంగా ఉద్యమకారులపై విషప్రచారం చేస్తే చెప్పులతో తన్ని తరిమికొడుతామని పేర్కొన్నారు. తెలంగాణ అమరుడు కొమురయ్య భార్య పూలమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఆరోపణలు చేస్తున్న ఆంధ్రాపాలకులు ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని నీలదీశారు. తెలంగాణ కళాకారులు డాక్టర్ ఒగ్గు రవి, అందె భాస్కర్ మాట్లాడుతూ ఎవరో వేసిన ఎంగిలి మెతుకులకు ఆశపడి, ఉద్యమకారులు, జర్నలిస్టులు, కళాకారులను అవమానిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కవి, రచయిత షెహబాజ్ అహ్మద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్టానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పరోక్షంగా ఇక్కడ తెలుగుదేశం, చంద్రబాబు పాలన నడుస్తున్నదని విమర్శించారు. రేవంత్ సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టకరమని వాపోయారు. ఈ వ్యవహారాన్ని ఇలాగే వదిలేస్తే చంద్రబాబు విగ్రహాలను సైతం ఇక్కడ పెడుతాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో కొత్తపల్లి మధు, సనత్ జైసూర్య తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్‌లలో బుక్స్,యూనిఫామ్స్
# దందాని అరికట్టాలి

- డీఈవో రోహిణికి ఎస్ఎఫ్ఐ వినతి

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో రోహిణి మేడంకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాదు నగరంలో ప్రవేటు కార్పోరేట్ స్కూల్ లలో బుక్స్ యూనిఫామ్స్ పేరుతో విద్యార్థులకు 8000 నుండి 15వేల రూపాయల వరకు తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్నారు.తమ స్కూల్లోనే బుక్స్ యూనిఫామ్స్ కొనాలని తల్లిదండ్రులను యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. బుక్స్ యూనిఫార్మ్స్ అమ్ముతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అనుమతి లేకుండా నడుపుతున్న ప్రవేట్ పాఠశాలలను మూసివేయాలని మరియు తోక పేర్లతో నడిపిస్తున్న పాఠశాలల పైనచర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ప్రీ ప్రైమరీ పేర్లతో ఆకర్షణీయమైన పేర్లతో తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలాదిగా ఫీజులు వసూలు చేయడమే లక్ష్యంగా ప్రవేట్ పాఠశాలలు చర్యలకు పాల్పడుతున్నాయని వారు అన్నారు. ప్రవేట్ పాఠశాల యజమాన్యాలకు కనీస భయం లేకుండా విద్యా వ్యాపారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. సీబీఎస్ఈ, కర్కులం, ఒలంపియాడ్, వరల్డ్, ఇంటర్నేషనల్ రకరకాల పేర్లతో పాఠశాలలకు తోకలు కలుపుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రవేట్ పాఠశాలలు వ్యవహరిస్తున్నాయని వాటిపైన జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టగొడుగుల్లా హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా వందలాదిగా ప్రైవేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమాన, ప్రవీణ్, ఆంజనేయులు, భారత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు,..



## ఉపాధి కూలీలకు కాసాని దంపతుల
# మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

- కార్మికులకు చల్లని ఉపశమనం
- నారాయణపురంలో ఉపాధికూలీలకు మజ్జిగ పంచిన కాసాని దంపతులు

**అశ్వారావుపేట, తెలంగాణం చౌరస్తా:**
అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. నారాయణపురం గ్రామం. భగ్గుమంటున్న ఎండల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు చల్లని ఉపశమనం కలిగించేందుకు బీఆర్ఎస్ పార్టీ మండల కీలక నాయకులు కాసాని నాగ శేషా పద్మ - చంద్రమోహన్ దంపతులు ముందుకు వచ్చారు. వారి సౌజన్యంతో అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు చేరుకున్న నాయకులు కూలీలకు స్వయంగా మజ్జిగ ప్యాకెట్లు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మండుతున్న ఎండల్లో శ్రమిస్తున్న కార్మికులకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం పట్ల కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాసాని నాగ శేషా పద్మ వీడియో కాల్ ద్వారా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పని చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, తరచూ నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కూలీల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తాము అందుబాటులో ఉంటామని తెలిపారు. మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ పట్ల నారాయణపురం ఉపాధి హామీ కూలీలు కాసాని నాగ శేషా పద్మ - చంద్రమోహన్ దంపతులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి, జక్కుల రాంబాబు, నారం అనురాధ, చందా కుమారస్వామి, చిన్నంశెట్టి వెంకట నరసింహం, కలపాల మంగరాజు, కాటూరి నాగేశ్వరరావు, వడ్లనపు కోటేశ్వరరావు తదితరులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ కాంగ్రెస్‌పై
# అధిష్టానం ఫోకస్

**తెలంగాణ చౌరస్తా, ఆంధ్రప్రదేశ్:**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ను బలోపేతం చేసే అంశంపై అధిష్టానం దృష్టిపెట్టనుంది. తెలంగాణతో పాటు తమిళనాడు, కేరళలో పార్టీ అధికారంలో ఉండటంతో దక్షిణాదిన బలహీనంగా ఉన్న ఏకైక రాష్ట్రం ఏపీపై ఆ పార్టీ దృష్టిసారిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న రాజ్యసభ ఎన్నికల్లో ఏపీ నుంచి ఒకరికి అవకాశం కల్పించడం ద్వారా రాష్ట్రంలో పార్టీని చురుకుగా పనిచేసేలా.. పార్టీ ప్రస్తుత కార్యకర్తల్లో ఓ నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే వైఎస్ షర్మిళకు రాజ్యసభ పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధిష్టానం దృష్టిలో పలువురు నేతలున్నా షర్మిలకే ఎక్కువ మొగ్గు కనిపిస్తోంది. సీనియర్ నాయకులు కేవీపీ రాంమచందర్రావు, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి లాంటి విధేయులు రేసులో ఉన్నప్పటికీ వారి వయోభారం రిత్యా.. వచ్చే ఎన్నికల నాటికి కూడా చురుకుగా పనిచేసే నాయకులకోసం పార్టీ చూస్తోంది. షర్మిల వైఎస్ కుమార్తెగా మాత్రమే కాకుండా.. ప్రస్తుత పీసీసీ అధ్యక్షురాలిగా, పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిరసనలు చేస్తుండటం, మీడియాలో ఎంతో కొంత చోటు దక్కించుకునే పాపులారిటీ ఉండటం, అన్నిటికన్నా మహిళలకు ప్రాధాన్యత ఇస్తే షర్మిళకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి.
ప్రస్తుతం కర్నాటకలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. నాలుగులో బీజేపీ కీ ఒక స్థానం పోగా మిగిలిన మూడు స్థానాలు కాంగ్రెస్ కు దక్కుతాయి. మూడింట్లో ఒక స్థానం పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖార్గేకు ఖాయం. మిగిలిన రెండు స్థానాల్లో ఒకటి ఏపీకి ఇవ్వాలన్న నిర్ణయంలో కాంగ్రెస్ ఉంది. జూన్ 8 నామినేషన్ల దాఖలుకు చివరితేదీ అవుతుండటంతో అక్కడి పార్టీ అభ్యర్థులపై కాంగ్రెస్ లో తీవ్ర కసరత్తు జరుగుతోంది. అందులో భాగంగానే వైఎస్ షర్మిళ శుక్రవారం రాహుల్ గాంధీని కూడా కలిశారు. నిన్న కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సిద్దరామయ్యకూడా తాను రాజ్యసభకు వెళ్లే ఉద్దేశం లేదని తేల్చి చెప్పడం షర్మిళకు మరింత అనుకూలంగా మారింది. షర్మిళకు గాంధీ కుటుంబం అనుకూలం. వైఎస్ జగన్ పార్టీ వీడిన తర్వాత కాంగ్రెస్ పూర్తిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ గా మారిపోయింది. ఆయన అభిమానులను తిరిగి కాంగ్రెస్ గూటికి తెచ్చుకునేందుకు షర్మిళ ఓ అవకాశం గా కనిపిస్తోంది. అందులో భాగంగానే సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఆమెకు రాజ్యసభ ఇచ్చేందుకు అనుకూలంగా వున్నారని తెలుస్తోంది. కర్నాటకలోని ఇద్దరు కీలక నాయకులు సిద్దరామయ్య, డీకే శివకుమార్ లతో షర్మిళకు మంచి సంబంధాలున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేవీపీ, రఘువీరాలతో పోల్చుకుంటే షర్మిళ వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.







# పాలకుర్తిలో ఉపాధి ఉత్సవం

- మెగా జాబ్ మేళాకు పోటెత్తిన యువత
- నిరుద్యోగ యువతకు ఉద్యోగాల బాట చూపుతున్న ఝాన్సీ రాజేందర్ రెడ్డి ట్రస్ట్

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**
పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర స్వామి కళ్యాణ మండపంలో హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతం . నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పాలకుర్తి నియోజకవర్గం నలుమూలల నుంచి యువత భారీ సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు.ఉదయం ప్రారంభమైన జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలిస్తూ ఇంటర్వ్యూలు నిర్వహించారు.పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా వివిధ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. యువతలో కనిపిస్తున్న ఉత్సాహం,భారీ స్పందన కార్యక్రమం విజయాన్ని ప్రతిబింబిస్తోంది.అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. వాలంటీర్లు అవసరమైన సమాచారం అందిస్తూ ఇంటర్వ్యూ ప్రక్రియలో సహకరిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు కెరీర్ గైడెన్స్ కూడా అందిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఆమె తెలిపారు.సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన ఈ మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, ట్రస్ట్ సభ్యులు,వాలంటీర్లు,నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

